క్లుప్తంగా


ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పేదలకు పంపిణీ



ఉంగుటూరులో ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పేదలకు ఎంతో ఉపయోగమని ఉంగుటూరు ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనం వద్ద 90 మందికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బండారు సింధు, ఎంపీటీసీ సభ్యులు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, ఉపసర్పంచి పాతూరి జగదీష్, చేబ్రోలు ఇండియన్ గ్యాస్ కంపెనీ డీలరు నోచర్ల శ్రీనివాసు, పంచాయతీ వార్డు సభ్యులు సూరత్తుల శ్రీను, బండారు మధు పాల్గొన్నారు.

50 వేల చిన్న శివలింగాల తయారీ



చిన్న శివలింగాలు తయారు చేయించి బాక్సుల్లో భద్రపరిచిన దృశ్యం

దెందులూరు: శ్రీ రామదండు ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, డైరెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో దెందులూరులో భక్తులు 50 వేల చిన్న శివలింగాలను తయారు చేశారు. తయారు చేసిన చిన్న శివలింగాలను బాక్సుల్లో భద్రపరిచారు. ఆదివారం సాయంత్రం కరస్పాండెంట్ నూకరాజు మాట్లాడుతూ శనివారం 40 వేలు, ఆదివారం 50 వేలు శివలింగాలు తయారు చేశామన్నారు. కోటి శివలింగాల మహోత్సవం కార్యక్రమంలో భాగంగా భక్తులు చిన్న శివలింగాలను తయారు చేస్తున్నారని, తయారు చేసిన శివలింగాలను కాశీకి పంపించనున్నట్టు వివరించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక పూల అలంకరణలో రాట్నాలమ్మ వారు

పెదవేగి : భక్తుల పాలిట కల్పతరువు రాట్నాలమ్మకు ఆదివారం ప్రీతికరమైన రోజుకావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తు లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం రాట్నాలమ్మకు పూజా టికెట్ల ద్వారా రూ.48,025, విరాళాలు రూ.14,079, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.18,000, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,575, మొత్తం అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.81,679 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్ తెలిపారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేవుని ఆశీస్సులు, క్రమశిక్షణతో లక్ష్య సాధన



ఫాదర్ డాక్టర్ పీ బాల 36వ గురుత్వ మహోత్సవం దృశ్యం

దెందులూరు: దేవుని ఆశీస్సులు, క్రమశిక్షణ, సత్ప్రవర్తన, కృతనిశ్చయంతోనే లక్ష్యాలను సాధించవచ్చని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పీ.బాల అన్నారు. ఆదివారం వేగవరం ఆర్‌సీఎం చర్చిలో వేగవరం విచారణ ఫాదర్ పీ.మోజెస్ ఆధ్వర్యంలో వికార్ జనరల్ గురుత్వ మహోత్సవం నిర్వహించారు. తొలుత ఫాదర్ రాజ్‌కుమార్, ఫాదర్ ఎం.బాలస్వామి, ఫాదర్ వై.దేవానందం, ఫాదర్ మోజెస్ ఆధ్వర్యంలో వికార్ జనరల్ ఫాదర్ బాల కృతజ్ఞత దివ్యపూజాబలి అర్పించారు. అనంతరం వేగవరం శనివారపుపేట, జోసెఫ్ నగర్ యూత్, ఫాదర్లు, సిస్టర్లు, సంఘ పెద్దలు, సంఘస్తులు, ఉపాధ్యాయులు వికార్ జనరల్ ఫాదర్ బాలను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఉంగుటూరు: కై కరంలో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.15,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై స్వామి ఆదివారం తెలిపారు. ఇదే గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఏడు క్వార్టరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రభుత్వ భవనాలను వేగంగా పూర్తి చేయాలి



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాలకు చెందిన అభివృద్ధి పనుల తీరుపై పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మండలాల వారీగా ఏగ్రామంలో ఏయే పనులు పూర్తయ్యాయి, వాటి పురోగతిపై ఆయన ఆరా తీశారు. నిర్మాణాలు నిలిచిపోయిన భవనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ భవనాలు దాదాపు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఆర్‌బీకే భవనాలు, విలేజ్ వెల్‌నెస్ కేంద్రాలు, గ్రంథాలయాల నిర్మాణ పనులు జరుగుతున్న తీరును అధికారులు వివరించారు. డిసెంబర్ నెలాఖరు నాటికి మొత్తం నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాని అధికారులకు సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఒక్కో సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.30 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ నిధులతో నిర్మిస్తున్న డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణాల పురోగతిపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ సమీక్షలో గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు దేవారపు సోమలక్ష్మి, కోడే కాశి, కె.జయలక్ష్మి, వైఎస్సార్ సీసీ మండల కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, మరడ మంగారావు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాల కన్వీనర్ అచ్చారావును పరామర్శించిన వాసుబాబు

నిడమర్రు: మండల సచివాలయాల కన్వీనర్, మాజీ వైస్ ఎంపీపీ నౌడు అచ్యుతరామారావును ఆదివారం ఆయన నివాసంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పరామర్శించారు. అచ్యుతరామారావు నానమ్మ సింహాచాలం ఇటీవల మృతి చెందారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఎమ్మెల్యే వాసుబాబు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేసారు. ఈయన వెంట జెడ్పీటీసీ కోడే కాశి, సిరపరపు శ్రీను, నౌడు అప్పారావు తదితరులున్నారు.

నేడు వాసుబాబు కార్యక్రమాలు

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటలకు గణపవరం మండలం జల్లి కొమ్మరలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు దెందులూరులో నిర్వహించనున్న సామాజిక సాధికారయాత్ర కార్యక్రమంలో పాల్గొంటారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని క్యాంపు కార్యాలయ ప్రతినిధి అడబాల రవి తెలిపారు.

వెండి, బంగారు ఆభరణాల చోరీ

పెదపాడు: ఇంటిలో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటిలోని రూ.30వేల విలువైన బంగారు, వెండి, ఆభరణాలు చోరీ అయినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలు ప్రకారం సత్యవోలు గ్రామానికి చెందిన కరణం సాయి దత్తు ఈనెల 20న ఇంటికి తాళం వేసి ఊర్లెళ్లి 26న ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటికి వచ్చేసరికి వెనుక ఉన్న తలుపు తీసి ఉండటంతో ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడినట్లు గుర్తించారు. ఇంట్లో వస్తువులు వెండి కుందెలు, వెండి పట్టీలు, బంగారం ఆభరణం చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత కార్యవర్గ సమావేశం

ఉంగుటూరు: మానవత మండల కార్యవర్గ సమావేశం నారాయణపురంలో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో వచ్చే నెలలో నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు. మానవత మండల అధ్యక్షుడు గంజి రవి అధ్యక్షత వహించారు. సమావేశంలో మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, సీతాల సత్యనారాయణ, అడాపా శ్రీను, గుణ్ణం బుల్లియ్య, బొమ్మిడి అప్పారావు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత ఉద్యోగాలు



వెల్లమిల్లిలో సాగర్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: విద్యార్థి స్థాయి నుంచి ఎంచుకున్న రంగంలో పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత ఉద్యోగ అవకాశాలు సులభంగా సాధించవచ్చని సెంట్రల్ బోర్డు డైరెక్టర్ ఆఫ్ టాక్సెస్ అసిస్టెంటు కమిషనర్ యాళ్ల సాగర్‌బాబు అన్నారు. ఆదివారం వెల్లమిల్లిలో షాలేము పెంతుకోస్తు ప్రార్థన మందిరంలో పాస్టర్ ఇస్రాయల్ అధ్యక్షతన సాగర్ బాబును ఘనంగా సభ్యులు సత్కరించారు. జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెంకు చెందిన యాళ్ల సాగర్‌బాబు ఇటీవల ప్రభుత్వం ప్రకటిరచిన సివిల్స్ పరీక్షలో ప్రతిభచూపి రెవెన్యూ సర్వీసుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సాగర్‌బాబు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని అన్నారు. ఎంచుకున్న రంగంలో విజయం సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న విద్యావనరులను సద్వినియోగం చేసుకుని ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని యువతకు సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి కష్టాలను అధిక మించి ఈ స్థాయికి వచ్చానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, యువత పాల్గొన్నారు.

నూర్‌బాషాలను మైనార్టీలుగా గుర్తించాలి



అంబర్‌పేట నుంచి గుంటూరు తరలివెళ్తున్న కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నూర్‌బాషా దూదేకుల సంఘ నాయకులు

భీమడోలు: రాజకీయపరంగా మైనార్టీలకు ఇస్తున్న అన్ని కోటాల్లోను జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని నూర్‌భాషా దూదేకుల ముస్లిం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఫిర్ మొహమ్మద్ అన్నారు. గుంటూరులో ఆదివారం నిర్వహించిన నూర్‌భాషా దూదేకుల ముస్లిం సింహగర్జనకు అంబర్‌పేట నుంచి సంఘ నాయకులు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన నూర్ భాషా కులస్తులకు చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరారు. నూర్‌భాషా దూదేకులకు రాజకీయంగా, రిజర్వేషన్ల పరంగా దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందన్నారు. తమను ఇస్లాం దూదేకులుగా గుర్తిస్తూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేసారు. తొలుత చలో గుంటూరు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్తపల్లి నాగూర్, అహ్మద్, వలి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం



భీమడోలులో అమ్మవారి విగ్రహం ఊరేగింపు



కంచి కామాక్షమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

భీమడోలు: భీమడోలులోని గుర్రాల చెరువు గట్టుపై వేంచేసియున్న కనకదుర్గమ్మ ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. నిత్యం పూజలందుకున్న అమ్మవారి విగ్రహాన్ని సుందరంగా ముస్తాబు చేసి ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, చిత్ర విచిత్ర వేషాలు, శక్తి, కాంతారా నృత్యాలు, డీజే, డప్పు వాయిద్యాలతో బాణ సంచా కాల్చుతూ గ్రామ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని కానుకలు చెల్లించారు.

భీమడోలు: మండలంలోని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం పలు గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలి వచ్చి అన్న సమారాధనలో పాల్గొన్నారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద గల పురాతన ఆలయం, కంచి కామాక్షమ్మ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. శివాలయం మాజీ చైర్మన్ యర్రంశెట్టి ఏడుకొండలు, పెద్దలు కె.మీనాచార్యులు, సాయి, ఏ.పెద్దిరాజు, ఏ.ములయ్య, వైఆర్‌కే శర్మ తదితరులు పాల్గొన్నారు. భీమడోలు గణపతి సెంటర్ ఏరియాలోని దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో 4వేల మంది భక్తులు అన్నదానం కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

వృద్ధులను జాతీయ సంపదగా భావించాలి



ఐక్యతను ప్రదర్శిస్తున్న వృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఉంగుటూరు: వృద్ధులను జాతీయ సంపదగా భావించాలని వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి అన్నారు. ఆదివారం ఉంగుటూరులో వృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నారాయణమూర్తి మాట్లాడుతూ 50 ఏళ్లపాటు కుటుంబానికి సేవచేసిన వ్యక్తి నేడు వృద్ధ వయస్సులో నిరాధరణకు గురవుతున్నారని అన్నారు. వృద్ధులు సుఖంగా ఉండేలా ప్రభుత్వాలు, సమాజంలో అన్ని వర్గాలు బాధ్యత తీసుకోవాలని నారాయణమూర్తి అన్నారు. అన్ని రంగాల్లో వృద్ధులకు ప్రాధాన్యం కల్పించాలని అన్నారు. వృద్ధుల సంరక్షణ చట్టం 2010లోనే అమలులోకి వచ్చిందని అన్నారు. వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. శివరామకృష్ణరావు మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమ సంఘంలో సభ్యులు సంఖ్య పెరగాలని, సంఘం బలోపేతం అవ్వాలని అన్నారు. ఏపీ రాష్ట్ర వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకిరామరాజు మాట్లాడుతూ వృద్ధుల హక్కులు కాలరాస్తే సహించేది లేదన్నారు. జిల్లా జనరల్ సెక్రటరీ బి. సత్యనారాయణ, వృద్ధుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు. వృద్ధుల ఐక్యత వర్ధిల్లాలి అని నినాదాలు చేసి సంఘీభావం తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బావాయిపాలెంలో గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నిడమర్రు: ఒకప్పుడు ఆ పాఠశాలలో విద్యార్థులుగా ఆటపాటలతో, చిలిపి చేష్టలతో విద్యాబుద్ధులు నేర్చి, కాలక్రమంలో వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు, వృత్తుల్లో స్థిరపడ్డారు. దశాబ్దకాలం తర్వాత వారంతా విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నిడమర్రు మండలం బావాయిపాలెం ఉన్నత పాఠశాల ఈ అపూర్వ సమ్మేళనానికి వేదికైంది. 2011లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు సుమారు 60 మంది ఆదివారం పాఠశాలలో కలుసుకుని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. గురువుల ఆశీస్సులు అందుకున్నారు. ఇకనుంచి ఏటా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థికి ఉన్నత విద్య చదవడానికి అయ్యే వ్యయాన్ని బ్యాచ్ తరపున భరించాలని నిర్ణయించారు. వీరి నిర్ణయాన్ని ఉపాధ్యాయులు అభినందించారు. ఎంఈవో కె.రాంబాబు, హెచ్‌ఎంలు శేషగిరిరావు, హరనాథ్, ఏసుబాబుతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పూర్వవిద్యార్థులు ఫణి, బి.అరుణ, డి.కిషోర్, తదితరులు ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించారు.

సచివాలయం, ఆర్‌బీకే భవన నిర్మాణం పూర్తి



నిర్మాణం పూర్తయిన దెందులూరు సచివాలయం



నిర్మాణం పూర్తయిన దెందులూరు రైతుభరోసా కేంద్రం

దెందులూరు: దెందులూరులో రూ.43.6 లక్షలతో సచివాలయం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణాలు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ఎస్‌ఎంఆర్ నగర్‌లో పూర్తయ్యాయి. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారంతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, నిధుల మంజూరుతోనే త్వరితగతిన ప్రభుత్వ కార్యాలయాలు పూర్తయ్యాయని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు అన్నారు. ఆదివారం నిర్మాణం పూర్తయిన రెండు ప్రభుత్వ కార్యాలయాలను వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీసభ్యులు, పార్టీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, దెందులూరు ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి పరిశీలించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

భీమడోలు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని భీమడోలు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసారు. లక్ష్మీపురానికి చెందిన దేవతోటి అప్పారావు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లు తెచ్చుకుని లక్ష్మీపురం బస్టాండ్ వద్ద స్థానికులకు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గల 8 లిక్కర్ క్వార్టర్స్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సీహెచ్ సురేష్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలి



పెదవేగి మండల కార్యవర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జి

పెదవేగి : ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల అభ్యున్నతి ఓపీఎస్‌ను కొనసాగించాల్సిందేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. యూటీఎఫ్ పెదవేగి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని జీపీఎస్, సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను మాత్రమే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం యూటీఎఫ్ పెదవేగి మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూటీఎఫ్ పెదవేగి మండల గౌరవాధ్యక్షుడిగా తేరా ప్రభాకర్(పినకడిమి), అధ్యక్షుడిగా టి.ఎడ్వర్డు (పెదవేగి), సహ అధ్యక్షుడిగా బీవీ రావు(లక్ష్మీపురం), కె.రామలక్ష్మి (ప్రకాష్‌నగర్), ప్రధాన కార్యదర్శిగా పీవీ రమణ (కూచింపూడి), కోశాధికారిగా ఎం.లక్ష్మీనారాయణ (రామ శింగవరం), ఆడిట్ కన్వీనర్‌గా వైబీవైవీ కుమార్ (తాళ్లగోకవరం), కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ సాబ్జీ, డీఈవో శ్యామ్‌సుందర్

ఉంగుటూరు(గణపవరం): పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, ఆ దిశగా ఉపాధ్యాయులు బాధ్యత గా పని చేయాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, డీఈవో శ్యామ్‌సుందర్ అన్నారు. ఆదివారం ఉంగుటూరుకు చెందిన స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని గురుస్పందన అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతగా, చిత్తశుద్ధి అంకితభావంతో పనిచేస్తేనే విద్యార్థులు ప్రయోజకులుగా తయారవుతారన్నారు. ఉంగుటూరుకు చెందిన శీతాలం సత్యనారాయణ, అల్లు శ్రీనివాస్, ఏవీఎస్ రాజు, జి.గవరయ్య, యు.రాంబాబు, గుదే శ్రీనివాస్, జి. వెంకటసత్యవతి, ఓ.ఈ ఆనందకుమార్, దారపురెడ్డి శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, తూతిక శివయ్య, షేక్ ఫరీద్ జహీరున్నీసా బేగంను ఎమ్మెల్యే సాబ్జీ, డీఈవో శ్యామ్‌సుందర్ సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సామ్యూల్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు జోగినాయుడు, కిషోర్‌కుమార్, సాయిరామకృష్ణ, చంద్రిక పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ద్వారా బాణసంచా విక్రయం



బాణసంచా విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, నాయకులు

పెదపాడు: డీసీఎంఎస్ ద్వారా ప్రజలకు నాణ్యమైన బాణసంచాను తక్కువ ధరకే విక్రయించడం మంచి పరిణామమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ కేంద్రాన్ని డీసీఎంస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్యతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. త్వరలో భీమవరం నిడుదవోలులో బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి, స్థానిక ఉపసర్పంచ్ చింతా మధుసూధనరావు, కత్తుల రవికుమార్, గుణపూరు మహేష్, గుజ్జుల నవీన్ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పుస్తకాలు చదవాలి

పెదవేగి : క్రమం తప్పకుండా పుస్తకాలు చదవడంతో ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని పెదవేగి శాఖ గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ చెప్పారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం–మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చక్కటి విజ్ఞాన భరిత పుస్తకాలను ఆయన చదివించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కువ సమయం మంచి పుస్తకాలు చదవడం ద్వారా మేధాశక్తిని పెంపొందించుకోవచ్చని వివరించారు.